**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**జాతీయ వార్తలు**

**తేదీ.15.02.2025** **సమయం. 19.05 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. కేంద్ర ప్రభుత్వం కృత్రిమ మేధ ను ఉన్నత విద్యకు అనుసంధానం చేసేందుకు క్రియాశీలక చర్యలు చేపడుతోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు.
2. దేశ పునరుత్పాదక శక్తి లక్ష్యాన్ని చేరుకోవటం మన దేశ కీలకమైన ఖనిజాల కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ సహాయ మంత్రి సతీష్ చంద్ర దూబే అన్నారు.
3. పాలస్తీనా లోని గాజాలో ముగ్గురు ఇజ్రాయెలీ దేశ శరణార్థులను ఈరోజు హమాస్ సంస్థ విడుదల చేసింది.
4. ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీలో పాల్గొనేందుకు కెప్టెన్ రోహిత్ శర్మ నేతృత్వంలోని భారతజట్టు దుబాయికి బయలుదేరింది.

## PREZ- JHARKHAND

కేంద్ర ప్రభుత్వం కృత్రిమ మేధ ను ఉన్నత విద్యకు అనుసంధానం చేసేందుకు క్రియాశీలక చర్యలు చేపడుతోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఈరోజు జార్ఖండ్ రాజధాని, రాంచిలో బిర్ల ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ మెస్ర 70 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ... కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్ లలో పురోగతి వల్ల భవిష్యత్తులో ఎన్నో ఆశ్చర్యకర మార్పులు సంభవిస్తాయని అన్నారు. ఉత్సాహం, నిబద్ధత గల యువత వికసిత్ భారత్ నిర్మాణంలో ముఖ్య పాత్ర పోషిస్తారని ద్రౌపది ముర్ము స్పష్టం చేశారు.

మహిళా సాధికారత గురించి రాష్ట్రపతి మాట్లాడుతూ... బాలికలు సైన్స్, ఇంజనీరింగ్, సాంకేతికత, గణితంలలో వెనకబడి లేరని అన్నారు.

## INDIA SRI LANKA

భారత్, శ్రీలంకల మధ్య ఖనిజాల అన్వేషణ గనుల తవ్వకంపై ఇరు దేశాల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేయడానికి చర్చలు జరిగాయి. ఈ మేరకు న్యూఢిల్లీలో ఈరోజు కేంద్ర బొగ్గు గనుల శాఖ సహాయ మంత్రి సతీష్ చంద్ర దూబే, శ్రీలంక పరిశ్రమల శాఖ మంత్రి సునీల్ హండున్నెట్టి తో సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఖనిజాల అన్వేషణ, గనుల తవ్వకంపై ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేస్తూ ఇరు దేశాల ఆర్థిక, పరిశ్రమల అభివృద్ధికి అవసరమైన ఖనిజాలను పరిరక్షించడం పై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి దూబే మాట్లాడుతూ.. దేశ పునరుత్పాదక శక్తి లక్ష్యాన్ని చేరుకునేందుకు లిథియం, గ్రాఫైట్, నికెల్, కాపర్ వంటి అరుదైన ఖనిజాల నిరంతర సరఫరాను నిర్ధారించడం భారతదేశ కీలకమైన ఖనిజాల కార్యక్రమ ఉద్దేశమని అన్నారు.

## ARVIND KEJRIWAL CVC

ఆప్ ఆద్మీ పార్టీ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ బంగ్లా నిర్మాణం, ఆధునికరణలలో జరిగిన అవకతవకల ఆరోపణలపై కేంద్ర విజిలెన్స్ కమిషన్ విచారణకు ఆదేశించింది. బిజెపి సీనియర్ నేత, ఢిల్లీ ఎమ్మెల్యే విజేందర్ గుప్తా ఫిర్యాదు మేరకు ఈ సంస్థ సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ శాఖకు విచారణకు ఆదేశాలు చేసింది. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ వాస్తవాల ఆధారంగా ఈ దర్యాప్తు చేపట్టిందని మీడియా సమావేశంలో గుప్త తెలియజేశారు.

## PM- SITARAMAN

ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ పార్లమెంటులో ఇటీవల చేసిన ప్రసంగంలో భారత ఆర్థిక వ్యవస్థ గురించి స్పష్టంగా తెలియజేశారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. పార్లమెంట్లో కేంద్ర బడ్జెట్ పై, ఆదాయపు పన్ను బిల్లు పై ప్రసంగాన్ని ప్రధానమంత్రి సామాజిక మాధ్యమ పోస్ట్ లో పంచుకున్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న సంస్కరణ విధానాలను గురించి ఆమె స్పష్టంగా తెలియజేశారని మోదీ ప్రశంసించారు.

## CBI - CYBER CRIME

కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) సైబర్ క్రైమ్ కు సంబంధించిన కేసులో ఢిల్లీ, హర్యానా లలో పదకొండు చోట్ల తనిఖీలు నిర్వహించి కోటి రూపాయలకు పైగా నగదు, వెయ్యి డాలర్లు విలువ గల విదేశీ కరెన్సీ, బంగారాన్ని స్వాధీనం చేసుకుంది. నిందితులు రాజకీయ నాయకుని వేషధారణలో చట్ట విరుద్ధమైన కార్య కలాపాలు చేస్తున్నట్టు సిబిఐ ఆరోపించింది. వీరు క్రిప్టో కరెన్సీ పేరుతో, నకిలీ టెక్నికల్ సపోర్ట్ కన్సల్టెన్సీ పేరుతో మన దేశంలోనూ, విదేశాల్లోనూ ఎంతో మందిని మోసం చేసారని సిబిఐ తెలిపింది.

## PM BODO COMMUNITY

బోడో తెగల ప్రజల అభ్యున్నతికి, వారి ఆకాంక్షలను నెరవేర్చేందుకు కేంద్రం లోని ఎన్డీఏ ప్రభుత్వం, అస్సాం రాష్ట్ర ప్రభుత్వం అవిశ్రాంతంగా పనిచేస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. అస్సాంలోని కొక్రజర్ లో నిర్వహించబోయే ఒకరోజు అసెంబ్లీ సమావేశాలపై అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ చేసిన సామాజిక మాధ్యమం పోస్టుకు స్పందనగా ప్రధానమంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. సోమవారం కోక్రజర్ లో జరగబోయే చారిత్రాత్మక ఒకరోజు ప్రత్యేక అసెంబ్లీ కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రశంసించారు.

## PUNJAB DEPORTERS

అమెరికా నుంచి బహిష్కరణకు గురైన భారతీయ అక్రమ వలసదారులను తీసుకొస్తున్న విమానాన్ని అమృత్సర్లో మరొకసారి దించడంపై పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనికి సమాధానంగా బిజెపి జాతీయ ప్రతినిధి ఆర్పీ సింగ్ మాట్లాడుతూ... ఈ సమస్యను రాజకీయం చేయొద్దని అన్నారు. నిన్న సాయంత్రం జరిగిన విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మన్ మాట్లాడుతూ... దేశంలో వందల విమానాశ్రయాలు ఉండగా కేంద్ర ప్రభుత్వం విదేశీ వ్యవహారాల శాఖ విమానాలను దించేందుకు అమృత్ సర్ ను ఎందుకు ఎంచుకుందని ప్రశ్నించారు. దీనికి సమాధానంగా అమెరికా నుంచి

భారత్ లోకి ప్రవేశించే విమానాలకు అమృత్సర్ అంతర్జాతీయ విమానాశ్రయం అతి దగ్గరగా ఉండడం వల్ల అమెరికా బహిష్కరించిన భారతదేశ అక్రమ వలసదారులను దించేందుకు ఎంచుకున్నామని బిజెపి జాతీయ ప్రతినిధి ఆర్పీ సింగ్ సోషల్ మీడియా వేదిక ద్వారా తెలియజేశారు.

## EVE ISRAEL-PALESTINE HOSTAGE

పాలస్తీనా లోని గాజా లో ముగ్గురు ఇజ్రాయెలీ శరణార్థులను గత నెల మొదలైన కాల్పుల విరమణ ఒప్పందం ప్రకారం ఆరవసారి ఇజ్రాయెల్ బందీలను ఈరోజు హమాస్ సంస్థ విడుదల చేసింది. గత ఏడాది అక్టోబర్ 7న ఇజ్రాయెల్ కిబుట్జ్ లో హమాస్ జరిపిన దాడిలో 80 మందిని అపహరించారు. వారిలో ఈరోజు ఈ ముగ్గురిని విడుదల చేశారు. బదులుగా ఇజ్రాయెల్ 369 మంది పాలస్తీనా ఖైదీలను విడుదల చేయవచ్చని భావిస్తోందని హమాస్ ఉగ్రవాద సంస్థ ఖైదీల మీడియా కార్యాలయం తెలిపింది. వీరిలో 36 మంది జీవితఖైదు అనుభవిస్తున్నారు. ఈ 333 మంది గాజాకు చెందినవారు ఉన్నారు. ఆఫర్ జైల్ నుంచి పాలస్తీనా ఖైదీలను ఇజ్రాయెల్ దేశం విడుదల చేయడం ప్రారంభించిందని మీడియా నివేదిక తెలియజేస్తోంది.

## CRICKET CHAMPIONS TROPHY

దుబాయ్ లో జరగనున్న ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో పాల్గొనేందుకు భారత క్రికెట్ జట్టు రోహిత్ శర్మ నేతృత్వంలోని ఈరోజు బయలుదేరింది. కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ రోహిత్ శర్మ, వైస్ కెప్టెన్ శుభమన్ గిల్, విరాట్ కోహ్లీ ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ విమానాశ్రయానికి చేరుకున్నారు. వారికి వీడ్కోలు పలికేందుకు పెద్ద సంఖ్యలో క్రీడాభిమానులు విమానాశ్రయానికి వచ్చారు. కాగా ఈ నెల **20** న భారత్ జట్టు బంగ్లాదేశ్‌తో తలపడుతుంది. **23**న పాకిస్తాన్‌తోను, మార్చి 2న న్యూజిలాండ్ తో తలపడనుంది. జస్ప్రీత్ బుమ్రా గాయం కారణంగా ఆటకు దూరంగా ఉన్నారు. యువ క్రికెటర్లు అర్షదీప్ సింగ్ ,హర్షిత్ రానా అద్భుతమైన ఆటతీరు కనబరిచే అవకాశం ఉందని భావిస్తున్నారు.

## PM PUJYA SANTH

ఈరోజు సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆయనకు నివాళులర్పించారు. పేద ప్రజలు, అనగారిన వర్గాల సంక్షేమం కోసం సంత్ సేవాలాల్ తన అంకితం చేశారని సామాజిక మాధ్యమ పోస్టులో ప్రధానమంత్రి పేర్కొన్నారు. సామాజిక అన్యాయానికి వ్యతిరేకంగా సంత్ నిరంతర పోరాటం చేశారని మోడీ అన్నారు. సమానత్వం, భక్తి నిస్వార్థ సేవ విలువలకు ఆయన కట్టుబడి ఉన్నారని పేర్కొన్నారు. సంత్ సేవాలాల్ సందేశాలు ప్రతి తరానికి ఆదర్శప్రాయమని ప్రధానమంత్రి అన్నారు.

## PRO F I H LEAGUE

హాకీలో 2024 - 25 F I H ప్రో లీగ్ క్రీడలలో భారత మహిళా జట్టు భువనేశ్వర్ లోని కళింగా స్టేడియంలో ఈరోజు సాయంత్రం ఐదు గంటల 15 నిమిషాలకు ఇంగ్లాండ్ తో తలపడింది. ఇదే స్టేడియంలో ఈ సాయంత్రం 7 గంటల 30 నిమిషాలకు పురుషుల జట్టు స్పెయిన్ తో తలపడుతుంది. గత F I H ప్రో లీగ్ ఆటలలో మహిళ జట్టు 16 మ్యాచ్ లలో 13 ఓడిపోయి 8వ స్థానంలో నిలువగా, పురుషుల జట్టు ఐదు మ్యాచుల్లో గెలుపు, ఆరు డ్రా లు, ఐదు ఓటములతో ఏడవ స్థానంలో నిలిచింది.

## S JAYASHANKAR

విదేశీ వ్యవహారాల మంత్రి డాక్టర్ ఎస్. జయశంకర్ గత రాత్రి ఉక్రెయిన్ విదేశీ వ్యవహారాల మంత్రి అండ్రీసైబీహ తో మ్యూనిచ్ భద్రత కాన్ఫరెన్స్ పై చర్చించేందుకు సమావేశం అయ్యారు. ఉక్రెయిన్ వివాద పరిష్కారం కోసం జరుగుతున్న కృషిపై ఇరు దేశాల నేతలు చర్చించారు. భారత్, ఉక్రెయిన్ల మధ్య ద్వైపాక్షిక సహకారం మరింత మెరుగుపరచడంపై కూడా వీరు చర్చించారు. ఉక్రెయిన్ లో శాంతిని నెలకొల్పడం, భారత్, ఉక్రేయిన్ మధ్య ద్వైపాక్షిక సహకారం మరింత బలోపేతం చేయడం కోసం కొత్త మార్గాల అన్వేషణ పై తమ చర్చ జరిగిందని డాక్టర్ జయశంకర్ ఎక్స్ వేదికగా తెలియజేశారు.